క్లుప్తంగా

హామీలు నెరవేర్చమంటే గొంతు నొక్కుతున్నారు


చెల్లబోయిన రంగారావు

భీమవరం: పేదల సమస్యలపై ప్రశ్నిస్తున్నవారి గొంతు నొక్కడానికి ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలు దారుణమని ఏఐటీయూసీ భీమవరం ఏరియా సెక్రటరీ చెల్లబోయిన రంగారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమేగాక హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తే వారి గొంతు నొక్కేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం పెద్ద మొత్తంలో అప్పులు చేయడం మినహా ప్రజలకు చేసిందేమిలేదన్నారు. కుంభకోణాలతో కూరుకుపోతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని రంగారావు హెచ్చరించారు.

పట్టా భూములు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల్లో నిరుపేదలకు ఇచ్చిన పట్టాభూములు, ఇతర గ్రామాల్లో పేదలకు ఇచ్చిన పట్టా భూములు విక్రయించినా, అన్యాక్రాంతం చేసినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం హెచ్చరించారు. ఆయా పట్టా భూముల్లో పట్టాదారులు తమకు కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇతరులకు అమ్మితే పట్టాను రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసు పెడతామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది వచ్చి విచారణ చేపట్టినప్పుడు పట్టాదారులు తమ పట్టాలను చూపించి సహకరించాలన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడిన ఆవును కాపాడిన ఫైర్ సిబ్బంది


సెప్టిక్‌ట్యాంక్‌లో పడిపోయిన ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

భీమవరం: ప్రమాదవశాత్తూ సెప్టిక్‌ట్యాంక్‌లో పడిపోయిన ఆవును ఫైర్ సిబ్బంది రక్షించారు. భీమవరం పట్టణం నల్లంవారితోటలోని రిలయన్స్ టవర్ వద్ద మూతవేయని సెప్టిక్ ట్యాంక్‌లో శుక్రవారం అటుగా వెళ్లి ఆవు ప్రమాదవశాత్తూ పడిపోయింది. విషయం తెలిసి ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు తన సిబ్బందితో వెళ్లి తాళ్లు, కర్రల సహాయంతో ఆవును బయటకు తీశారు.

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం: స్థానిక గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్ని చోట్ల పోయిన లైట్లను మునిసిపల్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలందరరేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వీధిలైట్లను మరమ్మతులు చేసి పరిస్థితిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

గడ్డివాము దగ్ధం


గుమ్ములూరు దగ్ధమవుతున్న గడ్డివామును ఆర్పుతున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని గుమ్ములూరు గ్రామంలో ఐదు ఎకరాల గడ్డి వాము శుక్రవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన పి.రవి వర ప్రసాద్‌కు చెందిన గడ్డివాముపై కాల్చిపారేసిన సిగరెట్ పీక వేయడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక అధికారి ఎ.నాగ మోహనరావు చెప్పారు. సమాచారం అందిన వెంటనే సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశామన్నారు. సంఘటనలో సుమారు 50 వేల విలువైన గడ్డి దగ్ధమైందని, మిగిలిన గడ్డిని రక్షించామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఎండల తీవ్రత వేడిగాలులు వల్ల ప్రజల దాహార్తిని తీర్చేందుకు నవుడూరు జంక్షన్‌లో మజ్జిగ చలివేంద్రం సీపీఎం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని సీపీఎం సీనియర్ నాయకుడు జుత్తిగ నరసింహా మూర్తి, లింగం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. దాతలు స్వచ్ఛందంగా ఆర్థికంగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండి నారాయణమూర్తి, కౌరు సుబ్బారావు, పాలా కోటేశ్వరరావు, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాళ్లకూరులో ఆధ్యాత్మిక సందడి


కాళ్ల: శేష వాహనంపై స్వామి, అమ్మవార్లు


కాళ్ల: వేంకటేశ్వరస్వామి వారికి మల్లెలతో పూజలు చేస్తున్న దృశ్యం


భీమవరం (ప్రకాశం చౌక్): వేంకటేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలలో నాలుగో రోజైన శుక్రవారం ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. నిత్యొపాసన, పంచసూక్తహనం, అనంతరం స్వామివారికి విశేషంగా సహస్ర మల్లెల పుష్పార్చన చేసి నీరాజన మంత్ర పుష్పములు సమర్పించారు. సాయంత్రం స్వామి వారికి శేష వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం రాత్రి స్వామివారి కళావేదిక వద్ద వల్లాది రఘు చేపట్టిన ఇంద్రజాల ప్రదర్శన, మిమిక్రీ, టాకింగ్ డాల్ ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్నకు అష్టోత్తర కలశాభిషేకం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం జేపీ రోడ్డులో శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అష్టోత్తర (108) కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి మహాన్యాస పూర్వకంగా నీరాజన మంత్రి పుష్పాలతో పూజలను నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో అష్టోత్తర (108) కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిత్యొపాసన బలిహారణ, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 200 మంది మహిళా భక్తులతో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు రోడ్డులోని విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శనివారం 11 కేవీ విద్యుత్ ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు తొలగించడం, వార్షిక మరమ్మతులు నిమ్మిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాడేరు, యమునాపల్లి, కొర్రపాడు, బేతపూడి, కరుకువాడ గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఉండిలో ఉచిత వైద్య శిబిరం

ఉండి: స్థానిక కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ కల్యాణ మండపంలో ఆదివారం భీమవరానికి చెందిన గౌతమీ నర్సింగ్‌హోమ్, ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షకార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ వైద్య శిబిరంలో గుండె, పేగు, గైనకాలజీ, ఎముకలకు సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలను అందిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి వైద్య శిబిరంలో వైద్య సేవలను అందిస్తామని స్పష్టం చేశారు.

వందేమాతరం...మనదే భారతం


ఆకివీడు: చిన్న మసీదు వద్ద నినాదాలు చేస్తున్న ముస్లింలు


భీమవరం: సమావేశంలో మాట్లాడుతున్న మురళీరామరాజు

ఆకివీడు: వందే మాతరం–మనదే భారతం అంటూ ప్రతి ఒక్క ముస్లిం జన్మనిచ్చిన భరతమాత ముద్దుబిడ్డలుగా జీవిస్తున్నామని స్థానిక ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎండీ బిలాల్ అన్నారు. ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారి ఆత్మ శాంతించాలని, ఉగ్రవాదుల్ని పూర్తిగా తుదిముట్టించాలని కోరుతూ స్థానిక ముస్లింలు శుక్రవారం మసీదులో ప్రార్థనలు చేసి భారత్ సైనిక చర్యకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బిలాల్ మాట్లాడుతూ నేడు దేశంలో ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే అది జవాన్ల కృషేనన్నారు. యుద్ధం వచ్చినా మనం అంతా ప్రశాంత వాతావరణంలో ఉన్నామంటే అది మన దేశ సార్వభౌమత్వాన్ని మరోసారి చాటుతుందని బిలాల్ అన్నారు. హత్యలు చేసేవారు భూమి మీద ఉండకూడదని ఖురాన్ చెబుతుందన్నారు. అందుకే సిందూర్ ఆపరేషన్ నిర్వహిస్తున్న ప్రభుత్వానికి పూర్తి మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ.జక్కీ అహ్మద్, ఆథిఫ్, సాజిద్, అజ్మల్, ఆరీఫ్, కిషోర్, ఖాలిద్, వలీ, సాలిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌పై భారత్ చర్యలకు మద్దతు

భీమవరం: భారత్‌పై పాకిస్థాన్ దుశ్చర్యలకు తగిన విధంగా బుద్ధి చెప్పే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఆంధ్రప్రదేశ్ రైతు కార్యచరణ సమితి పూర్తి మద్దతు ప్రకటించింది. శుక్రవారం భీమవరంలో రైతు కార్యచరణ సమితి గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు మట్లాడుతూ పాక్ ఉగ్రదాడికి ప్రతికారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కి సంఘీభావం తెలియజేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు భారత సైన్యానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు, పెన్మెత్స అప్పలరాజు, కమాలకరశర్మ, బీహెచ్ సత్యనారయణరాజు, కోళ్ల సీతారామ్, గంటా సుందరకుమార్ వడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి


గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చినమిల్లి రంగమ నాయుడు

పాలకోడేరు: గర్భిణులు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాలకోడేరు మండల ప్రాథమిక వైద్యాధికారి సీహెచ్‌వీ రంగం నాయుడు అన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సుమారు 40 మంది గర్భిణులను పరీక్షించి రక్త పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో బయటికి వెళ్లాలంటే ఉదయాన్నే వెళ్లి 10 గంటల లోపు గమ్యస్థానానికి చేరుకోవాలని అదేవిధంగా సాయంత్రం 5 దాటిన తర్వాత వెళ్లాలన్నారు. అధిక ఉష్ణోగ్రత నమోదవుతున్న నేపథ్యంలో శరీరంలోని నీరు చెమట రూపంలో బయటకి అధికంగా రావడం వల్ల శరీర ఉష్ణోగ్రతల్లో అసమతుల్యత ఏర్పడి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల వేడిని తగ్గించే పానీయాలు సేవించాలని సూచించారు. అలాగే గర్భం దాల్చిన వెంటనే సంబంధిత అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలు పరిశుభ్రంగా ఉంచాలి


పూడికతీత పనులను కొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: పంట కాలువలు పరిశుభ్రంగా ఉంటే ఆయా కాలువలపై తాగునీటికి ఆధారపడిన గ్రామాలకు స్వచ్ఛమైన నీరు లభిస్తుందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శుక్రవారం భీమవరం–యనమదుర్రు కాలువకు లాకుల వద్ద పూడికతొలగింపు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యనమదుర్రు లాకు నుంచి దిసురుమర్రు వరకు కాలువలో పూడిక తొలగింపు పనులు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో నీటిపారుదల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కునాదిరాజు మురళీకృష్ణంరాజు, డీసీ అధ్యక్షుడు రుద్రరాజు పుల్లంరాజు, బండి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పేదలను ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ 24.85 లక్షల విలువగల చెక్కులను అందించారు.

ప్రమాదకరంగా మారిన డైవర్షన్ రోడ్డు


నెగ్గిపూడి వద్ద పంటబోదెపై ముందుగా నిర్మించిన డైవర్షన్ రోడ్డు

పెనుమంట్ర: మార్టేరు–పెనుగొండ రోడ్డులో నెగ్గిపూడి పెట్రోల్ బంకు వద్ద పంట బోదెకు రూ. 59 లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణం కారణంగా 45రోజుల పాటు భారీ వాహనాలను ఆచంట, ఆలమూరు మీదుగా మళ్లించారు. అయితే ద్విచక్రవాహనదారుల రాకపోకలకు ఈ కల్వర్టు వద్ద డైవర్షన్ రోడ్డును నిర్మించారు. అయితే ఈ రోడ్డులో చిన్న కారులు ఆటోలు, మినీవ్యాన్‌లు అనుమతించడంతో ఈ డైవర్షన్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో నాలుగు రోజుల క్రితం వెడల్పుగా వేసిన డైవర్షన్ రోడ్డును మూసివేసి పక్కనే ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు మరో సన్నగా ఉండే డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఈ డైవర్షన్ రోడ్డును గ్రావెల్ వేసి నిర్మించాల్సి ఉండగా పక్కనే ఉన్న పంచాయతీ చెత్తతో ఏర్పాటు చేయడంతో ద్విచక్రవాహనదారులకు ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ద్విచక్రవాహనాలు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. గతంలో వేసిన డైవర్షన్ రోడ్డుకే సెంటర్ పోల్స్ ఏర్పాటు చేసి కాపాలదారుడిని పెట్టాల్సిన అధికారులు మరో సన్నని డైవర్షన్ రోడ్డును వేయడం వల్ల ద్విచక్రవాహనాలు దిగబడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ డైవర్షన్ రోడ్డుకు గ్రావెల్‌వేసి, ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్లేందుకు అనుమతించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన


కట్టుపాలెంలో మాట్లాడుతున్న సర్పంచ్ నాగరాజు

యలమంచిలి: బాల్య వివాహాలు యువత జీవితాలకు అనర్థాన్ని తెచ్చిపెడతాయని కట్టుపాలెం సర్పంచ్ పొన్నమండ నాగరాజు అన్నారు. కిషోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపు శుక్రవారం కట్టుపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేయాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు చేస్తే విధించే శిక్షలు గురించి వివరించారు. కార్యక్రమంలో పూరిళ్ల మాణిక్యాలరావు, పొన్నమండ నాగరాజు, పడాల శ్రీనివాస్, అంబటి విజయ్‌కుమార్, రామకృష్ణ, మహిళా పోలీసు లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు జయ కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని అలాంటి వివాహాలు గ్రామాలలో ఎక్కడైనా జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కి తెలియజేయాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాతారాణి అన్నారు. కిశోర వికాసం వేసవి కాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె పెనుమంట్ర మండలం మార్టేరులో తోకపేట అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని, బాలికలు అంగన్‌వాడీ సెంటర్‌లలో ఉచితంగా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా ఆత్మవిశ్వాసంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఐసీడీఎస్ పీఓ కృష్ణవేణి, నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు టి పోసమ్మ, ఏఎన్ఎం సుజాత, ఈఓ దుర్గాదేవి పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: కిషోర బాలికలంతా బాగా చదువుకోవాలని అందుకు పౌష్టికాహారం ఎంతగానో దోహదపడుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఊర్మిళ అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్టవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని అన్నారు. బాలికలు రుతుక్రమం సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు శుభ్రత గురించి వివరించారు. యోగ, వ్యాయామాలు ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

12న కాకినాడలో మాలల మహా రణభేరి


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న మాలల మహా రణభేరి నిర్వహించనున్నట్లు పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణ కార్యాలయంలో మహారణ భేరి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉన్న మాలమాదిగలను విడగొట్టి దళితుల అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్ర, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ నెల 12న పీవీ రావు 73వ జయంతి పురస్కరించుకుని కాకినాడలో మెక్లారిన్ స్కూల్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు మాలల మహా రణభేరి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొర్రపాటి వీరాస్వామి, బండి సుందర్‌రామూర్తి, వర్ధనపు ఆనంద్, దేవ రాజేష్, వర్ధనపు సురేష్, పెదపాటి పెద్దిరాజు, బొందా బుజ్జిబాబు, ఊటాల చిట్టిరాజు, పిల్లి శ్యామ్, వడ్లమూడి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మాక్ డ్రిల్


ప్రభుత్వాసుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పాకిస్థాన్‌పై భారత సైనిక చర్య నేపథ్యంలో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసులు వైద్యులు కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్కర సమయంలో వైద్య సేవలు ఎలా అందించాలి? అనే అంశంపై ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ జూలై 5కు వాయిదా

నరసాపురం: శనివారం జరగాల్సిన జాతీయలోక్ అదాలత్‌ను జూలై 5కు వాయిదా వేసినట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ ఎ.వాసంతి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశా రు. న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు ఈ విషయంపై సమాచారం ఇవ్వాలని కోరారు.

గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జ్ పీడీ పిచ్చయ్యకు ఈఈగా పదోన్నతి

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న గజ్జెల పిచ్చయ్యకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నత కల్పిస్తూ శుక్రవారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ పిచ్చయ్య మర్యాదపూర్వకంగా కలిసి పదోన్నతి విషయాన్ని తెలియజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ నాగరాణి పిచ్చయ్యను అభినందిస్తూ జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని, కోరారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదోన్నతి పొందిన పిచ్చయ్యకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

భీమవరం: పట్టణంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఎం నాయకుడు ఎం.వైకుంఠరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని తాడేరురోడ్డులో 82 ఎకరాల్లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లు ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇళ్ల కోసం లబ్ధిదారులు అధిక వడ్డీలకు అప్పులుచేసి లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి చెల్లించారని పేర్కొన్నారు. ఓ వైపు అప్పులకు వడ్డీ కట్టలేక ఇంటి అద్దెలు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సైకిల్ యాత్రలో నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి వినతిపత్రం ఇచ్చిన ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాత బస్టాండ్ మీదుగా దూర ప్రాంత సర్వీసులు

భీమవరం (ప్రకాశంచౌక్): బత్తిలి, పలాస, విశాఖపట్నం లాంగ్ డిస్టెన్స్ సర్వీసులు భీమవరం పాత బస్టాండ్ నుంచి బయలుదేరి వెళ్తున్నట్లు డిపోమేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓప్రకటన విడుదల చేశారు. భీమవరం నుంచి పాలకొల్లు–కాకినాడ– విశాఖపట్నం– విజయనగరం –పాలకొండ – బత్తిలి రూట్‌లో వెళ్ళే ఈ సర్వీసులను పాత బస్టాండ్ నుండి బయలుదేరి వెళ్తుందని స్పష్టం చేశారు. ఈ సర్వీసులు ప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు.

పెదనింద్రకొలను గాంధీ భవన్ అభివృద్ధికి ప్రణాళిక

భీమవరం: ఏలూరు జిల్లా పెదనింద్రకొలను గ్రామంలోని గాంధీ భవన్, విజయవాడ గాంధీ హిల్స్ అభివృద్ధికి ఏపీ గాంధీ స్మారకనిధి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ఏపీ గాంధీ స్మారకనిధి ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఇందుకూరి ప్రసాదరాజు చెప్పారు. విజయవాడలో గాంధీహిల్స్‌లో డాక్టర్ పీసీ గాంధీ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఏపీ గాంధీ స్మారకనిధి సమావేశం వివరాలను శుక్రవారం భీమవరంలో విలేకర్లకు తెలిపారు. విజయవాడ గాంధీ హిల్స్, పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనం పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయడానికి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ప్రసాదరాజు చెప్పారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వినతి

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ నాలుగు దిక్కులూ ప్రధాన కూడలిలో ఆర్చ్‌లను, పెద్ద పెద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక, అరసవల్లి ట్రస్ట్, జనసేన నాయకులు రైల్వే ఎడిఎన్ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ కు వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ అతి పురాతనమైనదని నిత్యం ప్రయాణికుల రద్దీతో కోలాహలంగా ఉంటుందని, ఇటీవలే రైల్వే స్టేషన్‌ను సుందరీకరణతో పాటు అనేక సౌకర్యాలను కల్పించారని తెలిపారు. అయితే భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ దూర ప్రాంతాల వారికి తెలియడం లేదని, ఈ స్టేషన్ కు నాలుగు దిక్కుల బోర్డులను ఆర్చ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను కోరారు. అవసరమైతే బోర్డులకు దాతల ద్వారా సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, చల్లా రాము, కొప్పినిడి బాబీ, కుక్కల బాల తదితరులు పాల్గొన్నారు.